క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో పండగ జరగాలి



తారాపురం గ్రామపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: గ్రామదేవతల పండగను ప్రశాంత వాతావరణంలో జరగాలని, దీనికి అందరూ సహకరించాలని డీఎస్పీ శ్రీధర్ కోరారు. మండలంలోని తారాపురం గ్రామంలో మంగళ, బుధవారాలు అక్కడి ఐదుగురు గ్రామదేవతల పండగ నిర్వహించనున్న నేపథ్యంలో ఆయన సీఐ తిరుమలరావుతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం గ్రామపెద్దలతో సమావేశమై పలు సూచనలు చేశారు. మంగళవారం జరిగే సిరిమానోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పండగ సందర్భంగా చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామపెద్దలే బాధ్యత వహించాలని తెలిపారు. 26వ నంబర్ జాతీయ రహదారికి గ్రామం ఆనుకుని ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, పాదచారులు, ప్రయాణికులు, భక్తులు, వాహనదారులు గమనించి, సహకరించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ సురేంద్ర నాయుడు ఉన్నారు.

పటిష్టంగా దిశ చట్టం అమలు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేసిన దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రతిఒక్కరూ చట్టంపై అవగాహన పెంచుకోవాలని, ఏదైనా ఇబ్బందికర వాతావరణంలో ఇరుక్కుపోతే దిశ యాప్‌ను సంప్రదించి, పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు యూటీఎఫ్ నాయకులు సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, ఒడిశా రైలు ప్రమాద మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పి.శంకరరావు, ఎస్.గోపాలం, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. విజయగౌరి, సీపీఐ నేత ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సూచించారు. సోమవారం స్థానిక సీహెచ్‌సీలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి సంఘ సమావేశానికి హాజరైన ఆయన ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలు, అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న వైద్య సౌకర్యాలపై సమీక్షించారు. సిబ్బంది, రోగులకు సంబంధించి, ఫర్నిచర్ కొనుగోలు, ఎక్స్‌రే గది మరమ్మతుల విషయమై కమిటీ చర్చించి, ఆమోదించింది. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ జి. శశి భూషణరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఆస్పత్రి అభివృద్ధి సంఘ సభ్యులు సుబ్బారావు, బంగారురాణి, అప్పారావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: డిప్యూటీ డీఈఓగా పి.బ్రహ్మాజీరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాడంగి: తహసీల్దార్‌గా అజీరఫీజాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సకాలంలో సమస్యలను పరిష్కరించాలి

తెర్లాం: సకాలంలో 'స్పందన' సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, సమస్యల పరిష్కారానికి వినతులు సమర్పించారు. అధికారులు వాటిని పరిశీలించి, పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి పలు సూచనలు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల లాగిన్‌లోకి వెళ్లి, అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అక్కారావు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే

మానవ మనుగడ



రామభద్రపురంలో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



సంతకవిటి: పచ్చదనం పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది



రేగిడి: రేగిడిలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ చేస్తున్న అధికారులు



బొబ్బిలి సీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రాజాం : గడిముడిదాంలో ర్యాలీ చేస్తున్న ఎంపీపీ లావేటి సులోచన, తదితరులు



వంగర: చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ డి.ఐజాక్, అధికారులు



తెర్లాంలో చేపట్టిన ర్యాలీలో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్



బొబ్బిలిలో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్



బాడంగి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ సూర్యనారాయణ



రాజాం సిటీ: రాజాం అంబేద్కర్ కూడలిలో మున్సిపల్ సిబ్బంది మానవహారం



రాజాం సిటీ: మొక్కలు పంపిణీ చేస్తున్న తోటపల్లి ప్రాజెక్టు డీఈఈ రామచంద్రారావు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సమావేశాలు, సదస్సులు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులంతా మానవ మనుగడ సాగాలంటే పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి, అది పెద్దయ్యేంత వరకు సంరక్షించాలని తెలిపారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన వాతావరణ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, పలు రకాల మొక్కలు నాటారు.

–సాక్షి నెట్‌వర్క్

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



తెర్లాం: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెమలాం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ఆర్.గదబవలస గ్రామంలో సోమవారం సాయంత్రం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామంలోనే సచివాలయ వ్యవస్థ, లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ ఉందన్నారు. ఇవే పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని గెలిపించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు బి.అప్పలనాయుడు, సర్పంచ్ ఎం.నరసింహులు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటి: ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని చిన్నయ్యపేటలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించే పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందులో ఇచ్చిన ప్రతీ హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. సొంతంగా మేనిఫెస్టోను కూడా తయారుచేయలేని అసమర్థుడు చంద్రబాబునాయుడు పక్క రాష్ట్రాల మేనిఫెస్టోను కాపీ కొట్టారని విమర్శించారు. జగనన్న పాలనలో ఇంతవరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికలలోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ రూపిటి రమణమ్మ, ఆర్.జగన్, ఎంపీటీసీ పి.శంకరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గండ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్ నాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, స్థానిక నాయకులు వావిలపల్లి రమణమూర్తి, రూపిటి జనార్దన, ఇనమల హరి, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఎం సీతారాం, ఏపీఓ త్రినాథ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పారంపేటలో గ్రామసభ

రేగిడి: మండలంలో పారంపేట గ్రామంలో భూముల సమగ్ర రీసర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఏవీ సత్యనారాయణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

వంగర: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతీ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ప్రజలు అందించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం రెవెన్యూ సేవలపై తహసీల్దార్ డి.ఐజాక్ సిబ్బందితో సమీక్షించారు.

గోగునార బ్యాగుల పంపిణీ

రాజాం: పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ డీటీవీ కృష్ణారావు గోగునారతో చేసిన బ్యాగులను కార్యాలయ సిబ్బందికి సోమవారం పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా పట్టణంలోని కొటక్ మహేంద్ర బ్యాంకు వీటిని సమకూర్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ గేదెల శ్రీనివాసులునాయుడును కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఎన్విరాన్‌మెంట్ అధికారి భాగ్యలక్ష్మి, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు

రేగిడి: ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, రేగిడి, నాయిరాలవలస ఆర్‌బీకేలను సోమవారం ఆయన సందర్శించారు. విత్తనాల కోసం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ ఏడాది ఎంటీయూ–1121, ఎంటీయూ–7029(స్వర్ణ), డీపీటీ–5204(సాంబమసూరి), ఎంటీయూ–1224, ఎంటీయూ–1064 రకాల విత్తనాలు అందించనున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

దుకాణాలపై దాడులు



రాజాం సిటీ: పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ నెల 5న సాక్షి పత్రికలో 'నిషేధమా..నీ జాడెక్కడ' శీర్షికతో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. బజారు రోడ్డు, శ్రీనివాస థియేటర్ రోడ్డు, మాధవబజార్ తదితర ప్రాంతాలతో పాటు కూరగాయలు, పండ్ల వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ సంచులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిపై అపరాధ రుసుం విధించినట్లు కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు.

స్థలం కేటాయించాలని వినతి

రాజాం సిటీ: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఆర్.జయరావు, సమతా సైనిక్ దల్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.మోహనరావు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తహసీల్దార్ కృష్ణంరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ఇంతవరకు నియోజకవర్గ పరిధిలో ఎక్కడా కూడా సామాజిక భవనం లేకపోవడం దురదృష్టకరమన్నారు.

అంతకాపల్లిలో 'ఫ్యామిలీ డాక్టర్'



రాజాం సిటీ: గ్రామాల్లో ఇంటింటికీ వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆకిరి భార్గవ్ అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

డయేరియాపై అప్రమత్తం

రాజాం సిటీ: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.భార్గవ్ అన్నారు. డయేరియా పక్షోత్సవాల్లో భాగంగా పొగిరి గ్రామంలో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డయేరియా సోకిన వెంటనే సంబంధిత ఆశ కార్యకర్తకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

బొబ్బిలి: స్థానిక కోటి చెరువులో ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలకు సీపీఐ డిమాండ్ చేసింది. ఇదే విషయమై ఆ పార్టీ నేతలు కోట అప్పన్న, మునకాల శ్రీనివాసరావు కలిసి, ఆర్‌డీఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆక్రమాలకు పాల్పడుతున్న వారిని అలానే వదిలేస్తే మున్ముందు కూడా అలానే చేస్తారని వారు అన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై దృష్టి

బొబ్బిలి: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై తొలుత దృష్టిసారించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, అలాగే ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు.

బాలల చట్టాలపై అవగాహన

తెర్లాం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బాలల చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. నేటి బాలలే రేపటి పౌరులని, బాలబాలికలంతా తమ రక్షణ కోసం ప్రభుత్వాలు చేసిన చట్టాలను తెలుసుకోవాలని తెర్లాం-1 సచివాలయం మహిళా పోలీసు రమాదేవి, తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తెలిపారు. అనంతరం పర్యావరణ దినోత్సవం నిర్వహించి, గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

డ్రోన్ సాయంతో మందుల పిచికారీ

రేగిడి: మండలంలో చెరుకు పంట సాగుచేస్తున్న రైతులు ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం ఏర్పాటు చేసిన మైక్రో న్యూట్రిన్స్ డ్రోన్లను వినియోగించుకోవాలని ఫ్యాక్టరీ కేన్ డీజీఎం ఎం.రమేష్‌కుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం డ్రోన్ల సాయంతో చెరుకు పంటకు రసాయన మందులను పిచికారీ చేశారు.

కదిలిన అధికార యంత్రాంగం

- 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆండ్రకు జ్వరమొచ్చింది' కథనానికి స్పందన
- ఆండ్ర, కె.ఎల్.వలస, లోతుగెడ్డ గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు



తోటవలసలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, రక్త పరీక్షల కోసం రక్తనమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

మెంటాడ: మండలంలోని ఆండ్ర, లోతుగెడ్డ, కె.ఎల్.వలస గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'ఆండ్రకు జ్వరమొచ్చింది' వార్తా కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెంటాడ, చల్లపేట ఆస్పత్రుల వైద్యారోగ్య సిబ్బంది సోమవారం బాధిత గ్రామాలకు చేరుకుని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాయి. జ్వరపీడితులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పరిస్థితి కొంచెం తీవ్రంగా ఉన్న వారిని ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు సమాచారం. అనంతరం మెంటాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి లోకప్రియా ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలంతా ఇంటింటికీ వెళ్లి, ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వరం బారినపడిన వారిలో 95 శాతం మందికి సాధారణ జ్వరమేనని నిర్ధారించారు. కె.ఎల్.వలస పంచాయతీలోని 13 గిరిజన గ్రామాల్లో చల్లపేట ఆస్పత్రి వైద్యుడు భాషా నేతృత్వంలో మూడు బృందాలుగా విడిపోయిన వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు ఫీవర్ సర్వే చేపట్టి, అవసరమైన ఉచితంగా మందులు అందజేశారు. ప్రమాదకర పరిస్థితులు అయితే ప్రస్తుతం లేవని, చాలామందికి సాధారణ జ్వరమేనని ఆయన తెలిపారు.

నియామక పత్రాలు అందజేత

సంతకవిటి: మండలంలోని జీఎస్‌పురం, తలతంపర గ్రామాల్లో ఖాళీ గా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సోమవారం నియామ క పత్రాలు అందజేశా రు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, జీఎస్‌పురం ఎంపీటీసీ ఐ.మురళి, గోళ్లవలస మాజీ సర్పంచ్ కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.